ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

తణుకు: ప్రొహిబిషన్, ఎక్సైజ్ చట్టం, ఎన్‌డిపిఎస్ చట్టం పరిధిలోకి వచ్చే ఆల్కహాల్, నాటు సారాయి, గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని రవాణా చేయడానికి అనుమతులు ఇస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి అన్నారు. శనివారం తణుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్లలో తనిఖీలు నిర్వహించి అనంతరం వారికి అవగాహన కల్పించారు. ఆల్కహాల్, నాటు సారాయి, గంజాయి, డ్రగ్స్ వంటి వాటని గుర్తించినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తాడేపల్లిగూడెం: పార్సిల్, రవాణా సంస్థలు తాము డెలివరీ చేయబోవు సరుకులపై అవగాహన కలిగి ఉండాలని ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తమ వద్దకు వచ్చే అనుమానిత పార్సిల్‌ల వివరాలను స్థానిక తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిబ్బందికి తెలియజేయాలని అన్నారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఎస్‌ఐలు ఆర్.దొరబాబు, మురళీమోహన్ పాల్గొన్నారు.

కొత్త ఇళ్లు లేవు.. పాత బకాయిలు ఇవ్వరు..!

2014-19లో నిర్మించిన ఇళ్ల బకాయిలపై మాటలకే పరిమితం
రెండు జిల్లాల్లో రూ.81 కోట్లు వరకూ బకాయిలు
కొత్త ఇళ్ల నిర్మాణానికి అందని ప్రభుత్వ సాయం
రెండు జిల్లాల్లో దాదాపు 40 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్
ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. ఆచరణకు పొంతన లేకుండాపోయింది. కొత్తగా ఇళ్ల నిర్మాణం, పాత బకాయిలు చెల్లింపుపై ప్రభుత్వం సామాన్య ప్రజానీకంతో ఆటలాడుతున్న పరిస్థితి. ముఖ్యంగా సొంతింటి కల నెరవేర్చుకునేందుకు సిద్ధమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం అందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచిపోయింది. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలనుకునేవారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణంపై అయోమయం నెలకొంది. ఇళ్లు నిర్మించుకుంటే తర్వాత ప్రభుత్వ సాయం అందదేమోననే భయం వెంటాడుతోంది. నిర్మిస్తే ధరలు పెరిగి మరింత భారం పడుతుందనే ఆందోళన మరోపక్క వెంటాడుతోంది. గతంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షల సాయం అందించేది. దీంతో ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా కొంత ఊరట దక్కేది. పెరిగిన ధరలతో ప్రభుత్వం అందించే సాయం సరిపోవడం లేదని రూ.5 లక్షలకు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటి వరకూ దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదు. కొత్తగా ఇళ్ల నిర్మాణం కోసం ఏలూరు జిల్లాలో 27 వేల దరఖాస్తులు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో అదేస్థాయిలో దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. విశ్లంతా ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందని పరిస్థితి. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రభుత్వ సాయం ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతామన్న దిగులు అందరినీ వెంటాడుతోంది. కొత్త ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే సాయం అందించాలని జనం కోరుతున్నారు. గతంలో ఇచ్చిన సాయం ఏమాత్రం సరిపోదని పెంచాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది.

పాత బకాయిలు చెల్లింపు మాటలకే పరిమితం

2014-19 మధ్యకాలంలో ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం ద్వారా వేలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం రూ.2.50 లక్షల సాయం (లోను) అందించేది. ఈ సొమ్ములో రూ.లక్షన్నర కేంద్రం నుంచి, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది. అప్పట్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల్లో కొంతమందికి తొలివిడత, మరికొంతమందికి రెండో విడత బిల్లుల కింద సాయం కొంతమేర జమైంది. చాలామందికి చిల్లిగవ్వకూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. 2019 ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణాల రుణ బకాయిలు విడుదల చేస్తామని అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం చెప్పినా ఇవ్వలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2014-19 మధ్య ఇళ్ల బకాయిలు చెల్లిస్తామని ప్రకటించింది. దీనిపై సర్వే చేసి ఎంతమందికి చెల్లించాలో తేల్చాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సర్వే చేసిన అధికారులు ఏలూరు జిల్లాలో 26,840 ఇళ్లు నిర్మించగా రూ.40.90 కోట్లు, పశ్చిమలో 25,855 ఇళ్లు నిర్మించగా రూ.40.75 కోట్లు ఇవ్వాల్సి ఉన్నట్లు తేల్చారు. ఇదిగో.. అదిగో అనడం తప్ప ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో చిల్లిగవ్వ కూడా జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు బకాయిల సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పాతబకాయిలు వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండాపోయింది.

ప్రభుత్వానికి గురువుల గుణపాఠం తప్పదు

బోధనేతర పనులు అప్పగించి అవమానిస్తారా
ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో ప్రస్తావిస్తా
ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి
ప్రభుత్వం ధోరణి మార్చుకోవాలి
రాష్ట్ర ఫ్యాప్టో ఛైర్మన్ సాయి శ్రీనివాస్
సమస్యలు పరిష్కరించకపోతే 12న చలో విజయవాడ
కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన ధర్నా విజయవంతం



డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని, పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో గురువుల గుణపాఠం ప్రభుత్వం ఎదుర్కోక తప్పదని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి హెచ్చరించారు. గురువులు విద్యను బోధించడమే కాకుండా అవసరమైతే ప్రభుత్వాలను కూడా మార్గదర్శకులని విషయం గమనించాలన్నారు. ఒకపక్క ఉపాధ్యాయులు బోధనేతర పనులతో సతమతమవుతుంటే, మరోపక్క ఆర్థికపరమైన అంశాలు పరిష్కరించకుండా మానసికంగా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భీమవరం కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నిర్వహించిన ధర్నా విజయవంతమైంది. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు వందలాది మంది తరలొచ్చి సమస్యలపై నినదించారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పట్ల నిర్లక్ష్యం వీడి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 12న చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రెటరీ జనరల్ ప్రకాశం అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ హాజరయ్యారు. గోపీమూర్తి మాట్లాడుతూ బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. మరోపక్క హ్యాండ్‌బుక్స్ పేరుతో మరింత పని భారాన్ని మోపుతున్నారన్నారు. 11వ పిఆర్‌సి ముగిసి, 12వ పిఆర్‌సి ముందుకొచ్చినా ఏఒక్కటీ అమలు చేయలేదని, తక్షణం 12వ పిఆర్‌సి కమిషన్ వేసి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాలుగు డిఎలు పెండింగులో ఉన్నా ఏఒక్కటీ ఇవ్వలేదని, కనీసం సరెండర్ లీవులు పెట్టుకుని మూడేళ్లవుతున్నా పట్టించుకునే నాధుడే లేడని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి ఇప్పటి వరకు ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం, ఉపాధ్యాయుల మధ్య వారధిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే శాసనమండలి సమావేశాల్లో ఉపాధ్యాయ సమస్యలు ప్రస్తావిస్తానన్నారు. రాష్ట్ర ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ధర్నా విజయవంతం కావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ ధోరణి మార్చుకోకపోతే ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. అన్ని రకాల ఆర్థిక అంశాలు వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ఫ్యాప్టో ఆధ్వర్యంలో యాప్ డౌన్ కార్యక్రమం చేపడతామన్నారు. జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పెన్మెత్స విజయరామరాజు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి ప్రకటించాలని, పెండింగ్ డిఎలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో సెక్రెటరీ జనరల్ జి.ప్రకాశం మాట్లాడుతూ 11వ పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని, ఎంఇఒ-2 సీనియార్టీ ప్రకారం మాత్రమే ఇవ్వాలని కోరారు. ఫ్యాప్టో కోఛైర్మన్ పెన్మెత్స సూర్యనారాయణ మాట్లాడుతూ ఐటిబీజీఐ ఉపాధ్యాయులకు 45 రోజులు గడిచినా పోషన్ ఐడి ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రెటరీ జనరల్ విఎస్ఎస్‌వి.రమణారావు, సుధాకర్, కోఛైర్మన్లు వెంకటేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరావు, ప్రజారోగ్య సివి.వట్నాల రామయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటరమణ, శ్రీమన్నారాయణ, ఎపిటిఎఫ్ 257 ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ, ఎపిటిఎఫ్ 1938 అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేక హరికృష్ణ, బిటిఎ ప్రధాన కార్యదర్శి మధుసూదనరావు, డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎరకేశ్వరరావు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటా పోరాటం చేయాలి
అదానీతో జగన్ చేసుకున్న ఒప్పందాన్ని కూటమి కొనసాగించడం సిగ్గుచేటు
ప్రజా ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు

మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయడంతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపకపోతే బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలుకుతామని ప్రజా ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను స్మార్ట్‌గా దోపిడీ చేస్తుందని విమర్శించారు. ప్రతి వ్యక్తిపై రూ.20 వేలు విద్యుత్ భారం పడిందని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఇంటింటా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అదానీతో విద్యుత్ ఒప్పందాన్ని చేసుకోవాలని మోడీ ఆదేశిస్తే, నాడు జగన్మోహన్‌రెడ్డి సంతకాలు చేశారని, నేడు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించకుండా అడ్డుకోవాలని, లేకపోతే భవిష్యత్ తరాలపైనా విద్యుత్ భారం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నెల ఐదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ఆందోళనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్లు-విద్యుత్ అదనపు భారాలు-ప్రత్యామ్నాయం' అనే అంశంపై ఐక్యవేదిక జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అదానీ ఒప్పందాలను వ్యతిరేకించి స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని చెప్పిన కూటమి నేతలు, నేడు అవే ఒప్పందాలను అమలు చేస్తూ అవే మీటర్లను బలవంతంగా బిగిస్తూ ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. రైతులకు ఇస్తామన్న భరోసా రూ.3500 కోట్లయితే విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేసే భారం సుమారు రూ.12 వేల కోట్లు ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ.30 వేల కోట్లు ప్రజలపై భారాలు వేస్తే, కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.30 వేల కోట్లు భారం వేసిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను విద్యుత్ బిల్లు ఆధారంగా అమలు చేయడం అన్యాయమన్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ఛార్జీలు పెంచుతున్న ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం అదే బిల్లును అడ్డం పెట్టుకుని పేదలకు సంక్షేమం అందకుండా చేయడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు ఇష్టం లేకుండా బిగించడం లేదని, ప్రజలను ఒప్పించే బిగిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిగించేవి స్మార్ట్ మీటర్లయినప్పటికీ, అవి టైమ్ బాంబులాంటివని చెప్పారు. ఈ మీటర్ల బిగింపుతో రూ.23 లక్షల కోట్లు అదానీకి లాభం చేకూరుతుందని, 93 నెలల తర్వాత ఆ మీటర్లు ఎందుకూ పని చేయవని చెప్పారు. రాష్ట్రంలో రెండు కోట్లు స్మార్ట్ మీటర్లు బిగిస్తే రూ.25 వేల కోట్లు ప్రజలపై భారం పడుతుందన్నారు. సగటున ప్రతి వ్యక్తిపై రూ.20 వేలు విద్యుత్ భారం పడుతుందన్నారు. గంట గంటకు రీడింగ్ తీయడమే కాకుండా విద్యుత్ వినియోగం బట్టి పగలొక ఛార్జీ, రాత్రి ఒక ఛార్జీ వసూలు చేస్తారని చెప్పారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలు మూడు ఉన్నాయని, ఇక్కడ పెద్ద పోస్టులో పని చేసేందుకు రూ.200 కోట్లు లంచాలిచ్చి ఉత్తర్వులు తెచ్చుకుంటున్నారంటే వారి ఆదాయం ఎంతుంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. చివరకు సూర్యరశ్మిని కూడా దోపిడీ చేసేందుకు 25 ఏళ్ల ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు, ఐదేళ్ల వినియోగానికి వసూలు చేస్తున్న ఛార్జీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు పన్నులు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, సూపర్ సిక్స్ పథకాల అమలుకు పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఐక్యవేదిక జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ తాము అధికారంలోకొస్తే ధరలు నియంత్రిస్తామని చెప్పి ప్రజలపై మరింత భారాలను మోపడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే భవిష్యత్తులో ప్రజానీకం పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారుతుందన్నారు. దీని ప్రభావం ప్రతిదానిపై పడుతుందని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, అఖిలభారత కిసాన్ సభ రాష్ట్ర నాయకులు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం చేసిన పొరపాటే మళ్లీ కూటమి ప్రభుత్వం చేస్తుందని, దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. ఐక్యవేదిక నాయకులు చింతకాయల బాబూరావు, శ్రామిక మహిళ నాయకురాలు డి.కళ్యాణి, ఎఐటియుసి నాయకులు చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారాం ప్రసాద్, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, కార్మిక సంఘం నాయకులు మహంకాళిరావు, ఎపిఎంఎస్‌ఆర్‌యు నాయకులు శ్రీనివాస్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జేమ్స్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు చైతన్యప్రసాద్, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖను మూసేసిన ఘనుడు జగన్

మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శ
అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవం సందర్భంగా ట్రాక్టర్లతో భారీ ర్యాలీ


ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ఐదేళ్ల పాలనలో వ్యవసాయ శాఖను మూత వేసిన జగన్, నేడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం సందర్భంగా పాలకొల్లులో శనివారం 300 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతులకు ఆక్సిజన్ లాంటి ఇన్సూరెన్స్‌ను చెల్లించలేని ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. నాడు రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవాలంటే రైస్ మిల్లుల వద్ద వారం రోజులు పడిగాపులు పడాల్సి వచ్చేదని, నేడు



రైతులకు చెక్కు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్, జెసి

కూటమి ప్రభుత్వంలో రైతులు ధాన్యం నచ్చిన మిల్లుకు అమ్ముకోవడంతో పాటు 48 గంటల్లో బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలో 46.85 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.

ఉండి : రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. శనివారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌వర్మ, రఘురామకృష్ణరాజు, పాకా సత్యనారాయణ, పీతల సుజాత, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం నియోజకవర్గంలోని 9629 మంది రైతులకు సంబంధించిన రూ.6.50 కోట్ల విలువైన నమూనా చెక్‌ను రైతులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, కూటమి నేతలు జుత్తిగ నాగరాజు, సుభాష్‌రాజు, జుత్తిగ శ్రీనివాస్, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులకు బాధ్యత లేదా..!

జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం
ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇచ్చేలా చూడాలన్న డిప్యూటీ స్పీకర్
పలు సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, సిటీ

కీలకమైన జిల్లా పరిషత్ సమావేశానికి ఆయా శాఖలకు బాధ్యత వహించే జిల్లా ఉన్నతాధికారులు హాజరు కాకపోతే ఎలాగని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమయానికి సమావేశానికి హాజరుకాకపోవడంపై మంత్రి మండిపడ్డారు. శనివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంఎల్‌ఎలు పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, జెడ్‌పి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులను ఇస్తుందన్నారు. ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు సముచితమైన గౌరవం ఇవ్వాల్సి ఉందన్నారు. ఇలాంటి కీలక సమావేశాలకు కిందిస్థాయి ఉద్యోగులను పంపిస్తే, సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుందన్నారు. అధికారులు చురుగ్గా పని చేయాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు ఎంత ముఖ్యమో ప్రజాసమస్యల పరిష్కారానికి జెడ్‌పి సర్వసభ్య సమావేశం అంతే ముఖ్యమన్నారు. ఇకపై తాను రెగ్యులర్‌గా ఈ సమావేశాలకు హాజరవుతానన్నారు. జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ స్కూళ్లలో ఆగస్టు 15కు జెండా వందనం చేయడం తొలగించారని, పునరుద్ధరించాలని కోరారు. రోడ్లు వేస్తున్న కాంట్రాక్టర్లకు సొమ్ము రావడం లేదన్నారు. పామాయిల్ ధర నిలకడగా ఉండేలా చూడాలన్నారు. పది రోజులకు ముందుగానే ఎజెండా కాపీలు ఇవ్వాలని కోరారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి

కొల్లేరు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ పూర్తికి, కొల్లేరు సమస్య పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. ఇటీవల కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికారిత కమిటీ కోరిన సమాచారాన్ని సమగ్రంగా స్పష్టతతో సంబంధిత అధికారులు నివేదిస్తే ఈ విషయంపై కేంద్రంతో తాము సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం కింద ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కల్పించి చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదవిద్యార్థులతో భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్ పెంపు ఆక్వారంగానికి తీరని నష్టం తెస్తుందన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీకి పదెకరాల నిబంధనను తీసేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రేట్లు తగ్గాయని, ఫీడ్ ధర రూ.రెండు తగ్గిందని, పరిశ్రమలు సుంకం భరిస్తే ఆక్వా రైతులు మనుగడ సాధిస్తారన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలన్నీ ఒకొక్కటిగా అమలు చేస్తుందన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రత్యేక అధికారులుగా హాజరయ్యారని, దానివల్లే కొందరు అధికారులు ఆలస్యంగా హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి కారణం లేకుండా హాజరు కాని అధికారులకు సంబంధించి విచారణ చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. సమావేశంలో కొవ్వూరు ఆర్‌డిఒ సుస్మితరాణి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ

మాట్లాడుతున్న సిఐ కాళీచరణ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సైబర్ నేరాల పట్ల యువత, మేధావులు కూడా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని భీమవరం రెండవ పట్టణ సిఐ జి.కాళీచరణ్ విద్యార్థులకు సూచించారు. భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులతో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సీతారామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాళీచరణ్ మాట్లాడుతూ మేధావులు, విద్యార్థులు కూడా సైబర్ నేరాలకు బలైపోతున్నారని, పోలీసుల దృష్టికి వచ్చిన కొన్ని విషయాలు వివరించారు. అందువల్లే విస్తృతస్థాయిలో సైబర్ క్రైమ్ పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అని పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముఖ్యంగా యువత, మేధావులు తెలియని నెంబర్ నుంచి వచ్చిన ఎటువంటి కాల్స్‌ను కూడా మాట్లాడకూడదని దానివల్ల జరుగుతున్న నష్టాలను వివరించారు. వీటితోపాటు విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నొక్కి చెప్పారు. ఎవరి వద్దైనా ఉంటే తమకు సమాచారం అందించాలని, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసైతే తమ జీవితాలను నాశనం చేసుకొని తల్లిదండ్రులకు విషాదాన్ని కలిగించవద్దని సూచించారు. చెడు వ్యసనాలు ఉన్న విద్యార్థుల వైపు కన్నెత్తి చూడవద్దని, అటువంటి వారితో స్నేహం వల్ల జరుగుతున్న దుష్పరిణామాలను ఆయన వివరించారు. విద్యార్థినులకు ఇబ్బంది వస్తే శక్తి యాప్ ద్వారా పోలీస్ సహాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణ రాజు మాట్లాడుతూ పోలీసులు అనుభవపూర్వకంగా తమ పరిశోధనలో వెల్లడైన అంశాలను చెప్తున్నందున విద్యార్థులు వాటిని గమనించి భవిష్యత్తులో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం రెండవ పట్టణ ఎస్‌ఐ కె.రామారావు మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్ వల్ల విద్యార్థులు జీవితాలను ఏవిధంగా అంతం చేసుకుంటున్నారో వివరించారు. యూట్యూబ్ వంటి వాటిని అవసరం మేరకే ఉపయోగించాలి తప్ప ఇతర చెడు వ్యవహారాలకు, వాటి జోలికి వెళ్లవద్దని ఆయన హితవు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులతో శక్తి యాప్ డౌన్లోడ్ చేయించి వాటి ఉపయోగాలు కూడా పోలీసులు వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అల్లు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా గ్రామీణ యువతి రవళి

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన మేడపాటి రవళి ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాలలో 200 మార్కులకు గాను 111 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఈమె తండ్రి మేడపాటి కృష్ణమూర్తి వ్యవసాయదారుడు కాగా తల్లి విజయ గృహిణి. మండలంలో అతి చిన్న గ్రామమైన వీరవల్లి పాలెంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతూనే ఉంది. కనీస సౌకర్యాలు లేని కుగ్రామం నుండి అనేకమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అనేది ఈ గ్రామానికి గర్వకారణమని పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా రవళి మాట్లాడుతూ చిన్నతనం నుండి న్యాయ వ్యవస్థలో ఉద్యోగం సాధించాలని ఉండేదన్నారు. ఎంబిఎ పూర్తి చేసినప్పటికీ కఠోర శ్రమ, తపనతో తన తల్లిదండ్రుల కష్టానికి కానిస్టేబుల్‌కి ఎంపికైనట్టు రవళిని తెలిపింది. ఈమెను గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందించారు.

భారతీయ రంగస్థల వైభవాన్ని చాటి చెప్పిన బళ్లారి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి



నివాళులర్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణ రెడ్డి

భీమవరం : భారతీయ రంగస్థలం వైభవాన్ని విదేశాల్లో బళ్లారి రాఘవ చాటి చెప్పారని కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో బళ్లారి రాఘవ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ మానవతా కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ అని పేర్కొన్నారు. తొలితరం కళామతల్లి ముద్దుబిడ్డలలో బళ్లారి రాఘవ ఒకరని అన్నారు. బళ్లారి రాఘవకు గుర్తింపుగా ఆంధ్ర కళా ప్రపూర్ణ బిరుదుతో గౌరవించబడ్డారన్నారు. కళా రంగానికి వీరు చేసిన సేవలకు గుర్తింపుగా 1981లో తపాలా బిళ్లను విడుదల చేసారన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, ఎఒ చంద్రశేఖర్, డిటిలు సూర్యనారాయణ, మద్రాపు సన్యాసిరావు, సూర్యనారాయణ రాజు, నాగమణి ఉన్నారు.

అంగన్వాడీలపై పెరిగిన పని భారం తగ్గించాలి

ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కానూరి తులసి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌పై పెరిగిన పని భారాన్ని తగ్గించాలని అంగన్వాడీ పెనుమంట్ర ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షురాలు కానూరి తులసి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సాయంత్రం మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెనుమంట్ర ప్రాజెక్ట్ రెండవ మహాసభకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.రూప్నీ లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలపై యాప్స్ పేరుతో పని భారాన్ని పెంచి, మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్స్ మార్చాలని, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా ఉండాలని, అందరికీ కనీస వేతనం అమలు చేయాలని, వారికి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 20 మందితో నూతన కమిటీ ఏర్పడింది. నూతన కమిటీ అధ్యక్షురాలుగా కానూరి తులసి, కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా సాయి మహలక్ష్మి, సహాయ కార్యదర్శిగా జి.శ్రీదేవి, కోశాధికారి పిడి.పరమేశ్వరి ఎన్నికయ్యారు.

పాలకొల్లులో..

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారతమాత సేవలో తరించిన మహనీయులు పింగళి వెంకయ్య అని, వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్తూపం వద్ద శనివారం భారతదేశ జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని క్విట్ఇండియా స్ఫూర్తివేదిక ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. భీమవరం పట్టణ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, క్విట్ ఇండియా స్తూప పున్ర నిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పింగళి వెంకయ్య అందించిన స్ఫూర్తిని జాతి మరువదని, స్వాతంత్ర ఉద్యమ కాలంలో మన దేశానికి ఒక కేతనం ఉండాలనే తపనతో వెంకయ్య మువ్వన్నెలతో పతాకాన్ని తీర్చిదిద్దారన్నారు. జెండా నాడు, నేడు, ఎన్నడూ మన కీర్తి కేతనంగా ఎగురుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్.కె.చాన్ భాషా, అడబ భాస్కరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, తెలుగు, ఆంగ్ల శాఖల సంయుక్త నిర్వహణలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ మాట్లాడుతూ జాతీయ జెండా రూపకల్పనలో పింగళి వెంకయ్య కృషిని కొనియాడారు. యువ్వనదశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని గాంధీజీ మన్ననలను పొందిన దేశభక్తుడు పింగళి వెంకయ్య అని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ శేఖరాణి మాట్లాడుతూ పరిశోధకునిగా, అధ్యాపకునిగా, బహుభాషా వేత్తగా ఆయన జీవితం ఆదర్శవంతమైనదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పంచాయతీ పరిధిలో గల జగన్నాధపురంలో శనివారం స్వమిత్వ గ్రామసభ నిర్వహించారు. ఈ సభకి గ్రామ సర్పంచి మూరా అలంకారం అధ్యక్షత వహించారు. సభలో తహశీల్దార్ అప్పారావు మాట్లాడుతూ ఇంటి కొలతలు, ఇతర వివరాలు సర్వే సిబ్బందికి తెలియజేసి సకాలంలో స్వమిత్వ సర్వే పూర్తి చేయడానికి స్థానికులు సహకరించాలని అన్నారు. గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 18 గ్రామాల్లో సోమవారం నుండి స్వమిత్వ సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. స్థానికులకు చెందిన ఇంటి స్థలాలను సర్వేచేసి స్థలాలకు సంబంధించిన ఇంటి యజమానికి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ గ్రామసభలో డిప్యూటీ ఎంపిడిఒ పిల్లి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఇళ్ల స్థలాల యజమానులను గుర్తించి వారికి హక్కు పత్రాలు ఇవ్వడానికి స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నామని డిప్యూటీ ఎంపిడిఒ మేడిద నవీన్ కిరణ్ అన్నారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సహకరించి హద్దులు కచ్చితంగా గుర్తించేలా కృషిచేయాలని ఆయన సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం ఇళ్ల స్థలాల యజమానులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు ఉన్నారు.

పెనుమంట్ర : గ్రామంలో ఉన్న ఇళ్ళు, ఖాళీ స్థలాల సర్వేకు అందరూ సహకరించాలని భట్లమగుటూరు గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి రాజు కోరారు. పంచాయతీ ఆధ్వర్యాన శనివారం స్వమిత్వ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సచివాలయ విఆర్ఒ మంగతాయారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ ఇళ్ల స్థలాలు, ఖాళీ స్థలాలు సర్వే చేసి ఇళ్లకు కొలతలు వేసి మ్యాప్‌లు తయారుచేసి వాళ్లకి అప్పచెబుతామన్నారు. గ్రామస్తులందరూ స్థలాలకు సంబంధించిన పత్రాలు, ఇంటి పన్నుల రసీదులు తమ వద్ద ఉంచాలని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు జంగం సత్యనారాయణ, జనసేన అధ్యక్షులు బయ్యే బాలాజీ, బిజెపి అధ్యక్షులు పేర్రాజు, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు పాలమూరు రాజేష్, టిడిపి ప్రధాన కార్యదర్శి గంటా శ్రీను పాల్గొన్నారు.

శ్మశాన భూముల రీసర్వేను అడ్డుకున్న దళితులు

ప్రజాశక్తి - ఉండి

దళితుల శ్మశాన భూములను రీసర్వే చేయడమే కాకుండా తమను అవమానించిన డిప్యూటీ తహశీల్దార్‌పై కేసు నమోదు చేయాలని దళిత నాయకులు పి.ఇడి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం మండలంలోని పాములపర్రు గ్రామంలోని దళిత శ్మశాన వాటికను సర్వే చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణ రాజును దళిత నాయకులు అడ్డుకున్నారు. తమ శ్మశాన వాటికను తమకు తెలియకుండా సర్వే చేయడం సరికాదని వాగ్వాదానికి దిగి, పాములపర్రు మెయిన్ సెంటర్లో ధర్నాకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా ఇరువర్గాలతో మాట్లాడుతూ ధర్నాను ఉపసంహరింపచేశారు. సోమవారం ఇరువర్గాల సమక్షంలో రీ సర్వే నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నాగార్జున తెలిపారు.

4న స్పాట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని ఆరుగొలను గ్రామంలో గల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర విద్యాలయంలో ఖాళీ సీట్లు భర్తీ కోసం ఈనెల 4వ తేదీ సోమవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐదవ తరగతిలో 13 సీట్లు, 10వ తరగతిలో 7 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 7 సీట్లు, ఇంటర్ రెండవ సంవత్సరంలో 14 సీట్లు కలిపి మొత్తం 41 సీట్లు ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలియజేశారు. సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా హాజరు కావాలని ప్రిన్సిపల్ దుర్గారావు విజ్ఞప్తి చేశారు.

ముద్దాయికి ఎనిమిదేళ్లు జైలు శిక్ష

రూ.5 వేల జరిమానా

తాడేపల్లిగూడెం : కత్తితో దాడి చేసిన నేరం రుజువు కావడంతో ముద్దాయి నక్క శ్యాంబాబుకు శనివారం తాడేపల్లిగూడెం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.మాధవి 8 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించినట్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హుసులూరి శివరామకృష్ణ తెలిపారు. కేసు వివరాల్లోకి వెళితే.. 2019లో మొదుగుటూరు గ్రామానికి చెందిన ప్రమీలకు సంతోషపురం గ్రామం కలిదిండి కాపురస్తుడు నక్క శ్యాంబాబుతో వివాహమైందని, కొంతకాలం గడిచిన తర్వాత భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థల వల్ల 2021 జనవరి ఆరో తేదీన నక్క శ్యాంబాబు, అతని భార్య ప్రమీలను కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. అప్పటి రూరల్ ఎస్ఐ నాళం శ్రీనివాస్ కేసు నమోదు చేసి, తర్వాతి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచారణ రూరల్ సీఐ ఎ.రమేష్, ఎస్ఐ జెవిఎన్.ప్రసాద్, సిబ్బంది సహకారంతో విచారణ అనంతరం శనివారం ముద్దాయికి 498(ఎ) ఐపిసి గాను మూడు సంవత్సరాలు, రూ.2 వేలు ఫైన్, 307 ఐపిసి గాను ఐదు సంవత్సరాలు, రూ.3 వేలు జరిమానా మొత్తం 8 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.ఐదువేల జరిమానా విధించినట్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివరామకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రైతు బాగుండాలని, రైతు సంక్షేమమే లక్ష్యంగా వారికి మేలు చేసి అన్నదాతలను ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండలంలోని కరుకువాడ, బేతపూడి గ్రామంలో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకాన్ని శనివారం ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో 8,335 మంది లబ్ధిదారులకు రూ.5 కోట్ల 63 లక్షలు అందిస్తున్నామని, వీరవాసరంలో 5,753 మందికి రూ.3.89 కోట్లు, భీమవరంలో 2,582 మందికి రూ.1.74 కోట్లు అందిస్తున్నామని అన్నారు. మొదటి విడతగా ప్రతి రైతుకు రూ.7 వేలు, రెండో విడత అక్టోబర్‌లో మరో రూ.7 వేలు, జనవరిలో మూడో విడత రూ.6 వేలు చొప్పున ఏడాదికి అర్హులైన రైతులకు రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండలాధికారులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచి, గ్రామస్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


భీమవరం టౌన్‌లో..


నరసాపురంలో..


తాడేపల్లిగూడెంలో..

నరసాపురం : రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం మండలంలోని సరిపల్లి గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని 11,965 మంది రైతులకు సుమారు రూ.8.08 కోట్ల చెక్కును అందించారు. కొత్తగా మండలానికి ఇచ్చిన డ్రోన్ ను రైతులతో కలిసి పొలంలో పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో నాయకర్ మాట్లాడుతూ రైతాంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి ఎడిఇ డాక్టర్ అబ్దుల్ రహీమ్, ఎఒ జ్యోసుల, పోలిశెట్టి శ్రీనివాస్, సర్పంచి ఈదా సురేష్, ఎంపిటిసి చెన్నం వెంకటరావు, కొప్పాడ రవి, మైలా వసంతరావు, కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'అన్నదాత సుఖీభవ', 'పిఎం కిసాన్ సమ్మాన్ నిధి' పథకాల కింద రూ.7,000 రైతులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమని ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ ఎర్రంశెట్టి బాబులు అన్నారు. ఈ సందర్భంగా ఎర్రంశెట్టివారి పాలెంలో రైతులు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ బాబులు, ఉప సర్పంచి తెలగంశెట్టి వాసు, శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం



ఆచంటలో..

ద్వారా శనివారం రైతు కుటుంబాల వారి బ్యాంక్ అకౌంట్ ఖాతాలకు మొదటి విడతగా రూ.7 వేలు చొప్పున జమ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు వీక్షించే విధంగా గౌరవ ముఖ్యమంత్రి సందేశాన్ని మండలంలోని అన్ని ఆర్ఎస్‌కెలలో ఉన్న టీవీల ద్వారా ఏర్పాటు చేయడం జరిగినదని ఆమె పేర్కొన్నారు. ఈ అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మండలానికి 4,528 రైతు కుటుంబాలకు గాను రూ.3.17 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలలో ఉన్నటువంటి రైతులు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని రాష్ట్రంలోని కూటమి సర్కార్ నిలబెట్టుకుందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. అన్నదాతా సుఖీభవ నిధి కింద ప్రతి రైతు ఖాతాలో తొలి విడతగా రూ.7 వేలు జమ చేసింది. కేంద్ర వాటా కింద రూ.2 వేలు, రాష్ట్రం వాటా కింద రూ.5 వేలు కలిపి ఒక్కో ఏడాది రూ.20 వేల చొప్పున అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు లబ్ధి చేకూరిందని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం వెంకట రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో ఆయన అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, టిడిపి ఇన్‌ఛార్జి, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వలవల బాబ్జి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మండల అధికారులు, హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ గోపాల్, ఆర్‌డిఒ కౌసర్ భానో, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తణుకు : రైతులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం మరోసారి నిలబెట్టుకుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలో 16,954 మంది రైతులకు రూ.11.46 కోట్ల సాయాన్ని వారి ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు రైతులకు పెట్టుబడి సాయంగా ఎంతో ఉపయోగపడతాయని ఎడిఎ గన్నమని నరేంద్ర అన్నారు. శనివారం తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి విశ్వనాధం కృష్ణవేణి, ఉపసర్పంచి గుణ్ణం రాజారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంట : రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల కష్టంలో అండగా నిలిచారని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట మృత్యుంజయ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో నియోజవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టేరు ఎడిఎ విఎన్.శ్రీనివాసరావు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షులు చిలుకూరి సీతారాం పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని పొలమూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ తొలి విడత రైతుల ఖాతాలో సొమ్ము జమ చేయడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. సహకార సంఘం నూతన ఛైర్మన్ కండిబోయిన శ్రీనివాస్ మాట్లాడారు. నీటి సంఘం అధ్యక్షులు గుడాల వెంకటేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు తోరం వెంకన్న బాబు టిడిపి గ్రామ ఉపాధ్యక్షులు జిల్లా ఆదినారాయణ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

ఐసిడిఎస్ ఆధ్వర్యాన పలుచోట్ల తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని కాళ్ల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి అన్నారు. జువ్వలపాలెం, మాలవానితిప్ప గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టమని, వీటిని తాగడం వల్ల బాలలకు ఎలాంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని చెప్పారు. ప్రతి తల్లి తన పాలను పుట్టిన అరగంటలోపే బిడ్డకు పట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం స్వాతి, ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్న, బి.లావణ్య, అంగన్వాడీ కార్యకర్తలు వేగేశ్న పద్మ, ఆశా కార్యకర్తలు పైడి తల్లి, మంగ, రామలక్ష్మి పాల్గొన్నారు.



నరసాపురంలో..

కాళ్లలో..

నరసాపురం : తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని మొగల్తూరు సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ తూర్పుతాళ్లు సెక్టార్ పరిధిలోని పసలదీవిలో శనివారం గర్భిణులు, బాలింతలకు ముర్రుపాలు, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, పిల్లల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రత తదితర అంశాలపై గృహ సందర్శన ద్వారా అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బందితో కలిసి వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ పర్యవేక్షకురాలు సిహెచ్.దుర్గా భవానీ, అంగన్వాడీ కార్యకర్త సునీత పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలకొల్లు ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పసిబిడ్డల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ యర్రా మాధురి మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చిన్నపిల్లలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయని, ఆగస్ట్ మొదటి వారాన్ని బ్రెస్ట్ ఫీడింగ్ వీక్‌గా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లీ బిడ్డ మధ్య అనుబంధాన్ని పెంచేవి తల్లి పాలు, పోషకాహారం పిల్లలకు చాలా మంచిదని, తల్లి పాలు వాళ్లకు సమతుల్య పోషకాలు అందిస్తాయని, కావాల్సిన విటమిన్స్, ప్రోటీన్స్, ఫ్యాట్ వంటివి తల్లిపాల వల్లే పిల్లలకు లభిస్తాయని తెలిపారు. ప్రతి తల్లీ బిడ్డ పుట్టిన ఏడాదిన్నర పాటూ తన పాలు పట్టించడం ఎంతో మేలన్నారు. రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని డాక్టర్ మాధురి చెప్పారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పెదగరువులో గల అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎస్ఎన్.మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ తల్లిపాల వల్ల బిడ్డలకు కలిగే ప్రయోజనాలు, బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అక్కడకు హాజరైన గర్భిణులకు, బాలింతలకు తెలియజేశారు. టీకాలు కూడా క్రమం తప్పకుండా వేయించాలన్నారు. దీంతో పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా పెరుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పి ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్త ప్రశాంతి, వరలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

ఉండి : శిశువులలో తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.బాల కుమారి తెలిపారు. శనివారం ఉండి గ్రామ పరిధిలోని 100, 104 అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భవతులకు గృహ సందర్శన నిర్వహించారు. గర్భవతులకు ప్రసవం ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించి తల్లిపాలలో ఉండే పోషకాలు చాలా ముఖ్యమైనవని, అవి తీసుకోవడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డకు అవి రక్షణ కవచంలా పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం అనూష, ఎంఎల్‌హెచ్‌పి శాంతి, ఆశా వర్కర్ సత్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు కుసుమ పాల్గొన్నారు.

గణపవరం : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం గణపవరంలో ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని గ్రామాల్లో తల్లిపాల ప్రాముఖ్యత గురించి బాలింతలకు అవగాహన కల్పించినట్లు గణపవరం సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి శనివారం చెప్పారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని చెప్పారు. ముర్రిపాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని చించినాడ అంగన్వాడీ-2 కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ ఎంఎన్.పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలను ఇవ్వడం బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. గ్రామంలోని పలువురు బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు బి.రజిని, ఎన్.సుజాత, కె.భారతి, జి.సత్యవతి పాల్గొన్నారు.

రైస్ మిల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

రైస్ మిల్ కార్మికులకు కనీస వేతన చట్టం సవరించి నెలకు రూ.26 వేలు జీతం ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ 32వ జిల్లా మహాసభ నాయకులు కె.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వాసుదేవరావు మాట్లాడుతూ మూడు పంటలు పుష్కలంగా పండే డెల్టా ప్రాంతాన్ని ఆక్వా చెరువులు తవ్వకంతో రైస్ మిల్లు కార్మికుల పరిస్థితులు దుర్భరంగా తయారైందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల నూతన యంత్రాలు వచ్చిన తర్వాత రైస్ మిల్ కార్మికుల పని భద్రత లేకుండా పోయిందన్నారు. నాలుగు లేబర్ కోడ్లు చట్టాలు తీసుకువచ్చి కార్మికులకు నిలువు దోపిడీ చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని పిలుపుచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా బొర్రా శ్రీనివాసరావు, కార్యదర్శిగా బి.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా కల్పిండి సత్యనారాయణ, కె.సత్యనారాయణ, పింక్ అప్పారావు, సహాయ కార్యదర్శిగా కె.తవిటి నాయుడు, కె.గోపాల్ రాజు, పి.సంసోను, కోళ్ల శ్రీనివాసరావు, బాల ఆంజనేయులు, జి.ఈశ్వరరావు, జి.జనార్ధన్ రావు, టి.కృష్ణతో పాటు 18 మందితో నూతన కమిటీ మహాసభ ఎన్నుకుంది.

మహాసభలో మాట్లాడుతున్న వాసుదేవరావు

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

కూటమి ప్రభుత్వం సుమారు లక్ష మందికిపైగా వితంతువులకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కాళ్ల సచివాలయంలో గ్రామ అధ్యక్షులు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యాన వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందా విజయ, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్, జనసేన గ్రామ అధ్యక్షులు బండారు సోమేశ్వరరావు, పుప్పాల బుజ్జి, బండారు నాని, సుంకర కాశి, ఆరేటి దిలీప్, ఏసోబు, గణపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కాళ్లలోని జువ్వలపాలెంలో..

భీమవరం టౌన్ : పింఛను పంపిణీ కేవలం సంక్షేమం మాత్రమే కాదని, ఇది ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న బాధ్యతను వ్యక్తం చేస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండలంలోని కరుకు బేతపూడి గ్రామంలో శనివారం కొత్త స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. కార్యక్రమంలో మండలాధికారులు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచి, గ్రామస్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరం : భర్త చనిపోయి వితంతువులుగా మారిన వాళ్లకు ప్రభుత్వం మంజూరు చేసిన స్పౌజ్ పెన్షన్లు వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తాయని సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు అన్నారు. కొత్తగా వచ్చిన పెన్షన్లను వీరవాసరంలో కొంతమంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రజాప్రతినిధులు శనివారం అందజేశారు. పెన్షన్లు పొందుతున్న భర్తలు మరణించడంతో ఆ పెన్షన్లను వారి భార్యలకు మంజూరు చేశారు. ఈ విధంగా మండలంలో మొత్తం 157 పెన్షన్లను వారి భార్యలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి, ఆదిరెడ్డి గంగారావు, ఎంపిటిసి విజయలక్ష్మి, వీరవల్లి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు చించినాడలో ఐద్వా మండల మహాసభ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ శెట్టిబలిజ పేట రామాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తెన్నేటి లక్ష్మీ సభా ప్రాంగణంలో ఐద్వా మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి సుగుణ, జిల్లెళ్ల ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతాపద్మ, పొగాకు పూర్ణ హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభకు మండల వ్యాప్తంగా మహిళలంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల డిమాండ్స్ డే జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 4వ తేదీన జర్నలిస్టుల డిమాండ్స్ డేను జిల్లాలోని విలేకరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యూజెఎఫ్) జిల్లా అధ్యక్షులు గుండా రామకృష్ణ శుక్రవారం కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 4వ తేదీన భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్‌కు జర్నలిస్టుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వివిధ పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టు లందరూ 4వ తేదీ ఉదయం 10 గంటలకల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత కూడుకున్నదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా విలేకరుల సమస్యల పట్ల సానుకూలంగా ఉందని అన్నారు. మనం వినతి పత్రం ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి మన డిమాండ్స్ తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి జర్నలిస్టు ఈ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

శారీరక వ్యాయామంతో షుగర్ నియంత్రణ

జనతా డాక్టర్ ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శారీరక వ్యాయామంతో షుగర్ వ్యాధిని నియంత్రించవచ్చని జనతా డాక్టర్ ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక కడకట్లలోని జనతా ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత షుగర్ వ్యాధి రక్త పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా షుగర్ వ్యాధి ప్రతి ఒక్కరిలోనూ వస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం గంట పాటు నడక అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వంద మందికి షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మణీంద్ర, త్రిమూర్తులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌కు టైమ్ కేటాయించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

టెక్నాలజీ రోజురోజుకు పెరుగుతున్న ఈ రోజుల్లో అడ్వాన్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌కు టైం కేటాయించి ట్రైనింగ్ ఇవ్వాలని మానెం బసవరాజు కోరారు. పాలకొల్లు పరిసర ప్రాంత ఆడియో, వీడియో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు మానెం బసవరాజు అధ్యక్షతన శనివారం స్థానిక వీవర్స్ కాలనీలోని మహిళా మండలి విజ్ఞాన భవనంలో జరిగింది. సభ్యులకు సభ్యత్వ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వట్టి శ్రీనివాస్, ట్రెజరర్ బత్తుల నాగేశ్వరరావు, నంబూరి పుల్లయ్య, అప్పాజీ, బండి కృష్ణ పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.1462/2022
ఇన్ ఒ.యస్.నెం.50/2022
బిట్వీన్ :
భార్గవ ఫుడ్ ప్రోడక్ట్స్ తరపున చింతలపాటి నారాయణమూర్తిరాజు ...పిటిషనరు/వాది
మరియు
కూరపాటి బాలరాజు (డైయిడ్) వగైరాలు ...రెస్పాండెంటు/ప్రతివాద్లు
పై నెంబరు దావాలో మిమ్ములను అనగా 1.కూరపాటి మరియమ్మ, 2.కూరపాటి కీర్తి 3.కూరపాటి సంతోష్ కుమార్లు చనిపోయిన కూరపాటి బాలరాజు గారి స్థానే పార్టీలుగా చేర్పించమని పిటీషను దాఖలు చేసి అందులో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసికొనక నిరాకరించుచున్నారు. కావున మీరు ది.19-08-2025 సం॥తేది ఉదయం గం.10.30 ని॥ల లగాయితు శ్రీకోర్టు వారి ఎదుట స్వయముగా కాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషి తెలియచేసుకో వలయును. అట్లు మీరు హాజరు కానియడల మీ పరోక్షమున తీర్మానము జరిగించెదరు.
పి.ఆంజనేయరాజు, అడ్వకేటు, తాడేపల్లిగూడెం. సెల్ : 9848018256

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.1461/2022
ఇన్ ఒ.యస్.నెం.50/2022
బిట్వీన్ :
భార్గవ ఫుడ్ ప్రోడక్ట్స్ తరపున చింతలపాటి నారాయణమూర్తిరాజు ...పిటిషనరు/వాది
మరియు
కూరపాటి బాలరాజు (డైయిడ్) వగైరాలు ...రెస్పాండెంటు/ప్రతివాద్లు
పై నెంబరు దావాలో మీరు అనగా 1.కూరపాటి మరియమ్మ, 2.కూరపాటి కీర్తి 3.కూరపాటి సంతోష్ కుమార్లు చనిపోయిన కూరపాటి బాలరాజు గారి వారసులుగా చేర్పించమని పిటీషన్ దాఖలు చేసి అందులో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసికొనక నిరాకరించుచున్నారు. కావున మీరు ది.19-08-2025 సం॥తేది ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయముగా కాని మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషి తెలియచేసుకో వలయును. అట్లు మీరు హాజరు కానియడల మీ పరోక్షమున తీర్మానము జరిగించెదరు.
పి.ఆంజనేయరాజు, అడ్వకేటు, తాడేపల్లిగూడెం. సెల్ : 9848018256